క్లుప్తంగా

రోటరీ సన్‌రైజ్ నూతన కార్యవర్గ ప్రతిష్ఠానం



కొత్త కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న డాక్టర్ వెంకటేశ్వరరావు

బోట్‌క్లబ్: రోటరీ క్లబ్ ఆఫ్ కాకినాడ సన్ రైజ్ నూతన ప్రతిష్ఠానోత్సవం స్థానికంగా ఓ హోటల్‌లో సోమవారం నిర్వహించారు. రోటరీ జిల్లా గవర్నర్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. క్లబ్ నూతన అధ్యక్షుడు శ్రీకృష్ణవర్మ, కార్యదర్శి సాయిసుందర్, ఇతర కార్యవర్గ సభ్యులు ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పోలియో నిర్మూలనకు రోటరీ తనవంతు కృషి చేస్తోందన్నారు. పొరుగు దేశాల్లో ఇంకా పోలియో వైరస్ ఉన్నందున, ముందు జాగ్రత్తగా భారత ప్రభుత్వం పోలియో చుక్కలు వేయిస్తోందన్నారు. పోలియో నివారణకు రోటరీ సభ్యులు ఇస్తున్న ప్రతి డాలర్‌కు బిల్ మిలింద ఫౌండేషన్ రెండు డాలర్లు జత చేసి ఈ కార్యక్రమానికి సాయం చేస్తోందన్నారు. కాకినాడ సన్ రైజ్ కార్యకలాపాలను డాక్టర్ వెంకటేశ్వరరావు ప్రశంసించారు. కార్యక్రమంలో తొమ్మిది మంది నూతన సభ్యులకు సభ్యత్వం ఇచ్చారు. రోటరీ ఫౌండేషన్‌కు విరాళాలు ఇచ్చిన సభ్యులకు సర్టిఫికెట్లు, ప్రశంసాపత్రాలను అందజేశారు. అనంతరం గవర్నర్‌ను క్లబ్ సభ్యులు సత్కరించారు.

దంత సంరక్షణతోనే ఆరోగ్యం



కార్యక్రమంలో మాట్లాడుతున్న అడ్డాల

బోట్‌క్లబ్: శారీరక, మానసిక ఆరోగ్యం దంత సంరక్షణతోనే ఆధారపడి ఉంటుందని ప్రముఖ దంత వైద్యుడు అడ్డాల సత్యనారాయణ అన్నారు. అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక ఏపీఐఐసీ కాలనీలో సోమవారం జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దంతాలు పటిష్ఠంగా ఉంటేనే అన్ని రకాల ఆహార పదార్థాలను తీసుకోగలమన్నారు. పోషకాలు సక్రమంగా అంది, రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. దంత క్షయం వల్ల నమిలే ప్రక్రియ కుంటుపడుతుందన్నారు. నోటి దుర్వాసన, సరిగ్గా నవ్వలేకపోవడం వల్ల ఆత్మ విశ్వాసం సన్నగిల్లుతుందన్నారు. దంతాల మధ్య ఖాళీలు ఏర్పడితే వెంటనే దంత వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు అడబాల రత్నప్రసాద్, కుమార యాదవ్, రాఘవరావు, రాజా తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థినికి సైకిల్ అందజేత



జ్ఞానేశ్వరికి సైకిల్, పుస్తకాలు అందిస్తున్న హరీష్

కరప: మానవతా దృక్పథంతో పేదలను ఆదుకోవాలన్న సంకల్పంతో సానా సతీష్‌బాబు ఫౌండేషన్ ద్వారా వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు సంస్థ చైర్మన్ తలాటం హరీష్ తెలిపారు. వేములవాడ శివారు సిరిగలపల్లిలంక రామాలయం వద్ద సోమవారం వేళంగి హైస్కూలులో చదువుతున్న పేద విద్యార్థిని జ్ఞానేశ్వరికి సైకిల్, పుస్తకాలు అందజేశారు. ఆమె ఉన్నత చదువులకూ తమ సంస్థ సహకరిస్తుందన్నారు.

ఉజ్వల భవిష్యత్తు నాశనం చేసుకోవద్దు



అవగాహన కల్పిస్తున్న వైఆర్‌కే శ్రీనివాస్

కాకినాడ రూరల్: పాఠశాలల విద్యార్థులు సత్ప్రవర్తనతో మెలగాలని, క్షణికావేశంలో గొడవలకు వెళ్లి ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సర్పవరం పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ వైఆర్‌కే శ్రీనివాస్ అన్నారు. పోలీస్ చట్టాలు, క్రమశిక్షణపై స్థానిక రమణయ్యపేట ఏపీఎస్పీ స్కూల్‌లో విద్యార్థులకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. స్కూల్ ప్రిన్సిపాల్ కె.గాయత్రి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి వైఆర్‌కే శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాలలో క్రమశిక్షణతో మెలగాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం ఎస్.శ్రీనివాస్, స్టాఫ్ సెక్రటరీ జోగి రెడ్డి, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.



తిమ్మాపురంలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సర్పంచ్ బెజవాడ, ఎంపీపీ విరీష



పండూరులో వైఎస్సార్ జయంతి వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న నాయకులు



ఇంద్రపాలెంలో వైఎస్సార్ చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటిస్తున్న నాయకులు

ప్రజల గుండెల్లో నిలిచిన వైఎస్సార్

- వాడవాడలా పండగలా మహానేత జయంతి వేడుకలు
- వాకలపూడిలో వైఎస్సార్ విగ్రహానికి కన్నబాబు నివాళులు
- పలు సేవా కార్యక్రమాల నిర్వహణ



వాకలపూడిలో వైఎస్సార్ విగ్రహం వద్ద జయంతి వేడుకల్లో కురసాల కన్నబాబు తదితరులు

కాకినాడ రూరల్: సుస్థిర, సుపరి పాలనతో పేదల సంక్షేమమే ధ్యేయంగా పాలన అందించిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలు కాకినాడ రూరల్ నియోజకవర్గంలో పండగలా జరిగాయి. ఆరోగ్య శ్రీ, 104 వంటి సేవలు, జలయజ్ఞం, సంక్షేమ పథకాలతో ప్రజల గుండెల్లో వైఎస్సార్ చిర స్థాయిగా నిలిచిపోవడంతో వాడవాడలా ప్రజలు ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కురసాల కన్నబాబు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో వైఎస్సార్ విగ్రహాలకు నివాళులర్పించారు. కేకులు కట్ చేసి, పంపిణీ చేశారు. క్యాంపు కార్యాలయంతో పాటు, వాకలపూడిలో జరిగిన వేడుకల్లో కన్నబాబు పాల్గొన్నారు. వాకలపూడిలో వైఎస్సార్ విగ్రహానికి పార్టీ జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, ఎంపీపీ బందిలి విరీష, నాయకులు కురసాల సత్యనారాయణ, కార్యకర్తలతో కలిసి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కన్నబాబు ఆధ్వర్యంలో వృద్ధాశ్రమాల్లో వృద్ధులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. తిమ్మాపురంలో జరిగిన వేడుకల్లో సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ, ఎంపీపీ బందిలి విరీష, ఎంపీటీసీ ముద్దన వెంకట్రాజు, శ్రీను చంద్ర తదితరులు వైఎస్సార్‌కు నివాళులర్పించారు. పండూరులో వైఎస్సార్ సీపీ నాయకుడు నందిపాటి అజయ్, ఎంపీటీసీ నందిపాటి శ్రీను, ధర్మరాజు, ఆదినారాయణ తదితరులు మహానేతకు శ్రద్ధాంజలి ఘటించారు. సర్పవరంలో జరిగిన వేడుకల్లో పుల్ల చందు, పుల్ల శ్రీరాములు తదితరులు నివాళులర్పించారు. చీడిగలో కొప్పిశెట్టి గణేష్, కొవ్వాడలో మాజీ ఎంపీపీ గోపిశెట్టి పద్మజ బాబ్జీ, ఇంద్రపాలెంలో గీసాల శ్రీను, గంగనాపల్లిలో గీసాల శ్రీనివాసరావు తదితరుల ఆధ్వర్యంలో వైఎస్సార్ జయంతి వేడుకలు జరిగాయి. కాకినాడ అర్బన్ 49వ డివిజన్‌లో వైఎస్సార్ విగ్రహానికి జమ్మల మడక నాగమణి, రామశర్మ, కడియాల చిన్న తదితరులు నివాళులర్పించారు.

జన హృదయాల్లో సుస్థిరంగా..

కాకినాడ: పేదల హృదయాల్లో దివంగత ముఖ్యమంత్రి, మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి సుస్థిర స్థానం పొందారని వైఎస్సార్ సీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కురసాల కన్నబాబు అన్నారు. స్థానిక బాలాజీచెరువు సెంటర్‌లో సోమవారం వైఎస్సార్ జయంతి సందర్భంగా మహానేత కాంస్య విగ్రహానికి, వైఎస్ చిత్రపటానికి నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. వైఎస్సార్ సీపీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ వైఎస్ అంటే సంక్షేమమని, ఆయన మరణించినా ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకుని జీవించే ఉన్నారన్నారు. తండ్రి ఒక్క అడుగు వేస్తే కుమారుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మరో నాలుగు అడుగులు వేసి పేద ప్రజల సంక్షేమానికి ఎంతో పాటుపడ్డారన్నారు. వైఎస్సార్ స్ఫూర్తితో ప్రజల పక్షాన నిలుస్తామన్నారు. పార్టీ ఓటమి చెందినప్పటికీ, ప్రజల అభివృద్ధి, సంక్షేమానికి వైఎస్సార్ సీపీ కట్టుబడి ఉందని, పార్టీకి నిబద్ధతతో పనిచేస్తున్న ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రచార కమిటీ ప్రధాన కార్యదర్శి రావూరి వెంకటేశ్వరరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు బెండా విష్ణుమూర్తి, పసుపులేటి వెంకటలక్ష్మి, ద్వారంపూడి చారిటబుల్ ట్రస్ట్ ఆర్గనైజర్ కర్రి వీర్రెడ్డి, చినబాబు, జిల్లా ఐటీ సెల్ చైర్మన్ కృష్ణప్రియ, పార్టీ నాయకులు వాసుపల్లి కృష్ణ, గద్దేపల్లి వాసు, మాజీ కార్పొరేటర్లు ఎంజీకే కిషోర్, పేర్ల జోగారావు, చవ్వాకుల రాంబాబు, వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



బాలాజీచెరువు సెంటర్‌లో వైఎస్సార్ చిత్రపటం వద్ద కన్నబాబు, సుంకర శివప్రసన్న నివాళులు



కరప పీహెచ్‌సీ వద్ద వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ, ఎంపీపీ, నేతలు



వాకాడలో వైఎస్సార్ కటౌట్ వద్ద నివాళులర్పిస్తున్న పార్టీ శ్రేణులు

స్వచ్ఛంద రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న సంఘ ప్రతినిధులు

కాకినాడ: దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి, కాకినాడ సిటీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పుట్టిన రోజు సందర్భంగా కాకినాడ రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. స్థానిక డి-కన్వెన్షన్‌లో జరిగిన ఈ కార్యక్రమాన్ని సంఘ ప్రధాన కార్యదర్శి ద్వారంపూడి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు నల్లమిల్లి బుచ్చిరెడ్డి మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, సమాజ హితం కోసం తమ సంఘం పాటుపడుతుందన్నారు. సంఘ ప్రధాన కార్యదర్శి ద్వారంపూడి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రక్తదాన శిబిరానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. సుమారు 100 మంది రక్తదానం చేశారు. రోటరీ క్లబ్ ప్రతినిధులు రక్తదాన శిబిరానికి తోడ్పాటునందించారు. శ్యామ్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు నల్లమిల్లి మాచారెడ్డి, తాడి ఆదిరెడ్డి, నల్లమిల్లి సత్తిరెడ్డి, కర్రి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదల పాలిట పెన్నిధి

కరప: పేద, బడుగు, బలహీన వర్గాలు, రైతుల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పేదల పాలిట పెన్నిధి అని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి కొనియాడారు. వైఎస్సార్ జయంతి సందర్భంగా సోమవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదురుగా ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పార్టీ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అభిమానులతో కలిసి ఘనంగా నివాళులర్పించారు. జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, మండల యూత్ అధ్యక్షుడు పెంకే సత్తిబాబు, గ్రామ కమిటీ అధ్యక్షుడు మేడిశెట్టి సత్తిబాబు, సర్పంచ్‌లు సాదే ఆశాజ్యోతి, పలివెల నాగేశ్వరరావు, వాసంశెట్టి శ్రీనుబాబు, వెలుగుబంటి సీతారామరాఘవ, పలివెల రామారావు, పార్టీ నాయకులు సాదే లోహిదాస్‌కుమార్, నక్కా సత్తిబాబు, అడబాల ప్రసాద్, మద్దూరి భాస్కర్, నాగల బాలాజీ, గోన శ్రీను, చిన్నారి మురళి, బేరి కృష్ణమూర్తి, తుమ్మలపల్లి చంద్రనగేష్, పుణ్యమంతుల బాల, దివ్యాంగుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. మహానేత జయంతి సందర్భంగా వేములవాడలో పార్టీ నాయకులు కమిడి శంకర్, బండే తాతాజీ, వజ్రపు కామేష్, దూడల శ్రీను, ఉద్దండ సూర్యనారాయణ తదితరులు, వాకాడలో మోకన రాంబాబు, ఎంపీటీసీ చక్కపల్లి ఫకీర్రావు, పెంకే విశ్వేశ్వరరావు, యండమూరులో గ్రామ కమిటీ అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్ మాజీ సర్పంచ్‌లు మార్నెళ్ల వెంకటరమణ, నురికుర్తి వీరన్న, షేక్ దరియా, నడకుదురులో గోవిందు, యడ్ల కృష్ణార్జున, దాలిపర్తి శ్రీనివాసరావు, వేళంగిలో సానా శ్రీను, కె.గుణ, జవ్వాది రాంబాబు, పెద కొత్తూరులో చింతా బుజ్జి ఆయా గ్రామాల్లోని వైఎస్సార్ విగ్రహాలకు నివాళులర్పించారు.



యండమూరులో వైఎస్సార్ విగ్రహం వద్ద కేక్ కట్ చేస్తున్న నాయకులు



వేములవాడలో మహానేత విగ్రహానికి శ్రద్ధాంజలి ఘటిస్తున్న నాయకులు

సమస్యలకు సత్వర పరిష్కారం

కార్పొరేషన్ కమిషనర్ జె.వెంకటరావు



అర్జీదారుడి సమస్య తెలుసుకుంటున్న కమిషనర్ జె.వెంకటరావు

కాకినాడ: ప్రజలు తమ దృష్టికి తెచ్చిన సమస్యలకు సత్వర, నాణ్యమైన పరిష్కారాన్ని అందిస్తామని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు అన్నారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ఉదయం 9:30 నుంచి 10:30 వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫోన్ ద్వారా ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. పారిశుధ్యం, టౌన్ ప్లానింగ్, యూపీఏ సహా వివిధ విభాగాలకు సంబంధించి 23 మంది తమ సమస్యలను కమిషనర్‌కు ఫోన్‌లో వివరించారు. ఆయా సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కమిషనర్ అక్కడున్న అధికారులను ఆదేశించారు. అనంతరం ఉదయం 10:30 నుంచి ఒంటి గంట వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను కమిషనర్ నేరుగా స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసమే ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ద్వారా వచ్చిన ప్రతి ఒక్క సమస్యకూ ప్రత్యేక ప్రాధాన్యమివ్వాలని, ఆర్థికపరమైన అంశాలు మినహా, మిగిలిన సమస్యలన్నింటినీ నిర్ణీత కాల వ్యవధిలో, సాధ్యమైనంత వేగంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గత వారం నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థకు సంబంధించి వచ్చిన ఫిర్యాదుల్లో 95 శాతం పరిష్కరించామన్నారు. మిగిలిన సమస్యలు కూడా త్వరలోనే పరిష్కరిస్తామని కమిషనర్ చెప్పారు. కాగా 15 మంది నేరుగా కమిషనర్‌ను కలిసి సమస్యలు విన్నవించారు. ప్రతి శుక్రవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కారంపై ఆయా విభాగాధిపతులతో సమీక్షించినట్టు కమిషనర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కాకినాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు ఎస్ఈ పి.సత్యకుమారి, డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీచరణ్, స్మార్ట్ సిటీ ఎస్ఈ వెంకటరావు, డీసీపీ హరిదాస్, ఏసీపీ నాగశాస్త్రులు, మేనేజర్ కర్రి సత్యనారాయణ, ఏఓ శిరీష్, వివిధ విభాగాధిపతులు, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

ఘనంగా ద్వారంపూడి పుట్టిన రోజు వేడుక



కేక్ కట్ చేస్తున్న నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న

కాకినాడ: కాకినాడ సిటీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పుట్టిన రోజు వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. నాయకులు, కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ సుంకర విద్యాసాగర్, రాష్ట్ర ప్రచార కమిటీ ప్రధాన కార్యదర్శి రావూరి వెంకటేశ్వరరావు, ఐటీ సెల్ చైర్మన్ విష్ణుప్రియ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు పసుపులేటి వెంకటలక్ష్మి, బెండా విష్ణుమూర్తి, మాజీ కార్పొరేటర్ పలక సూర్యకుమారి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్మికుల ఒప్పందం అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వీరబాబు

కాకినాడ సిటీ: కాంట్రాక్టర్ చేసుకున్న ఒప్పందం ప్రకారం పేర్కొన్న అంశాలను కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆస్పత్రిలో శానిటేషన్ వర్కర్స్‌కు అమలు చేయాలని, లేని పక్షంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టాలని జీజీహెచ్ శానిటేషన్ వర్కర్స్ జనరల్‌బాడీ సమావేశం నిర్ణయించింది. సోమవారం జరిగిన ఈ సమావేశంలో సీఐటీయూ నగర అధ్యక్షుడు పలివెల వీరబాబు మాట్లాడుతూ ఫిబ్రవరిలో చేపట్టిన సమ్మె సమయంలో జరిగిన ఒప్పందం ప్రకారం కార్మికులకు నెలకు రూ.1,100 అదనంగా చెల్లించాల్సి ఉందన్నారు. అయితే మార్చి, ఏప్రిల్, మే నెలల జీతాలు చెల్లించినప్పటికీ, పెంపుదల సొమ్ము కార్మికులకు అందలేదన్నారు. సబ్బులు, నూనె, చెప్పులు, టవళ్లు వంటి సరకులు అందిస్తామంటూనే ఉగాది నుంచి వాయిదా వేస్తున్నారన్నారు. ఈ శనివారం లోగా ఒప్పందం అమలు చేయకపోతే ఆందోళన చేపడతామని తెలిపారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి మలక వెంకటరమణతో పాటు, సంఘ నాయకులు జె.శేషు, ఆర్.రమేష్, ఎం.ఏసు, డి.దుర్గాప్రసాద్, ఎం.రవి, ఎస్.వాసు, బి.మంగతాయారు, సీహెచ్ పుష్ప తదితరులు పాల్గొన్నారు.

రోటరీ గోల్డెన్ జూబ్లీ సేవలు ప్రశంసనీయం



నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణం చేయిస్తున్న శ్రీరామ్

బోట్‌క్లబ్: బ్లడ్ బ్యాంక్, వృద్ధాశ్రమం, మంచినీటి పథకం, రోటరీ బరియల్ గ్రౌండ్ వంటి శాశ్వత ప్రాజెక్టులు నిర్వహిస్తున్న రోటరీ క్లబ్ కాకినాడ గోల్డెన్ జూబ్లీ సేవలు ప్రశంసనీయమని క్లబ్ ఎలెక్టెడ్ గవర్నర్ శ్రీరామ్ అన్నారు. స్థానిక వివేకానంద పార్కు వద్దనున్న ఫ్యాబిన్ కన్వెన్షన్ హాల్‌లో గోల్డెన్ జూబ్లీ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం సోమవారం జరిగింది. క్లబ్ అధ్యక్షుడు నరహరిశెట్టి రవికృష్ణ అధ్యక్షత వహించారు. క్లబ్ నూతన అధ్యక్షుడిగా శ్రీకాంత్ శిష్టల, సెక్రటరీగా దామెర శ్రీకాంత్, ట్రెజరర్‌గా పి.స్వరూప్‌రాజు ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యురాలు ఉషారాణి వృద్ధాశ్రమానికి రూ.60 వేల విరాళం అందించారు. కార్యక్రమంలో రోటరీ మాజీ గవర్నర్ ఎస్‌వీఎస్ రావు, క్లబ్ సభ్యులు డాల్ఫిన్ వెంకన్న, అచ్యుతరామారెడ్డి, నల్లమిల్లి మాచారెడ్డి, నెక్కంటి శ్రీనివాస్. జీకే శ్రీనివాస్, వాడ్రేవు రవి, వైడీ రామారావు తదితరులు పాల్గొన్నారు.

కాకినాడలోనే పరీక్షలు నిర్వహించాలి

కాకినాడ సిటీ: బీఎస్సీ నర్సింగ్ విద్యార్థుల సెమిస్టర్ పరీక్షలు గతంలో లాగే రంగరాయ మెడికల్ కళాశాలలో నిర్వహించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు సోమవారం డీఆర్వో తిప్పే నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఏటా కాకినాడలోనే పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు ఈ ఏడాది అమలాపురం కిమ్స్ హాస్పిటల్‌లో పరీక్షా కేంద్రం ఇచ్చారని, దీనివల్ల కాకినాడ నుంచి అమలాపురం వెళ్లి పరీక్ష రాయడం వారికి చాలా ఇబ్బందికరంగా ఉంటుందని చెప్పారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా కాకినాడ జిల్లాలోనే పరీక్షలు నిర్వహించాలని వారు కోరారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

కాకినాడ సిటీ: ఎస్సీ వర్గీకరణ సాధనకు ఏర్పాటైన ఎమ్మార్పీఎస్ 30 ఏళ్ల ఆవిర్భావ దినోత్సవం సోమవారం స్థానిక సాంబమూర్తినగర్‌లోని దండోరా స్థూపం వద్ద జరిగింది. మహాజన సోషలిస్ట్ పార్టీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు వల్లూరి సత్తిబాబు, పార్టీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పలివెల నవీన్ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మందకృష్ణ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ నాయకులు చాట్ల ఆశీర్వాదం, సిద్ధాంతపు జాన్సన్, డోకుబుర్ర రాజబాబు, తాతపూడి రాఘవులు, నవరపు వీర్రాజు, మిరియాల వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

- కలెక్టర్ షాన్ మోహన్ సగిలి
- పిఠాపురంలో నియోజకవర్గ స్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ షాన్ మోహన్

పిఠాపురం: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అందిన ప్రతి అర్జీని సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ షాన్ మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. స్థానిక రథాలపేటలోని అంబేడ్కర్ కమ్యూనిటీ హాలులో సోమవారం నియోజకవర్గస్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. అధికారులతో కలిసి కలెక్టర్ ప్రజల అర్జీలను స్వీకరించారు. ఆయా సమస్యలకు త్వరితగతిన సమగ్రమైన, సంతృప్తికరమైన పరిష్కారాలు చూపాలని మండల, డివిజన్ స్థాయి అధికారులను ఆదేశించారు.

మొత్తం 556 అర్జీలు

ప్రజల నుంచి మొత్తం 556 అర్జీలు అందాయి. రెవెన్యూ, పింఛన్ల మంజూరు, టిడ్కో గృహాలు, ఇళ్ల స్థలాలు, భూ రికార్డుల ఆన్‌లైన్, డ్రైన్, కాలువల్లో పూడిక తొలగింపు, శ్మశాన వాటికకు స్థలం మంజూరు తదితర సమస్యలపై వినతులందాయి. తొలుత కలెక్టర్ షాన్‌మోహన్, ఆర్డీఓ ఇట్ల కిషోర్ తదితరులు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ సూచనల మేరకు పిఠాపురం నియోజకవర్గంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను రెండు వారాలకోసారి నిర్వహిస్తున్నామన్నారు. అర్జీలను సకాలంలో పరిష్కరించేందుకు ప్రత్యేక టాస్క్ ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేశామన్నారు. ప్రతి అర్జీని సకాలంలో పరిష్కరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ ప్రగతిని ప్రతి శనివారం సమీక్షిస్తామన్నారు. ఆర్థికపరమైన అంశాలతో ముడిపడిన అర్జీలను నిధుల మంజూరైన తర్వాత పరిష్కారిస్తామన్నారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు జారీ అయ్యాక కొత్త పింఛన్లు మంజూరు చేస్తామన్నారు. కాకినాడ ఆర్డీవో ఇట్ల కిషోర్, జిల్లా ఉపాధి శిక్షణాధికారి జి.శ్రీనివాసరావు, కాకినాడ, పెద్దాపురం డీఎల్డీవోలు పి.నారాయణమూర్తి, ప్రసాద్ రాజు, పిఠాపురం, గొల్లప్రోలు కమిషనర్లు ఎస్.కనకరావు, టి.రవికుమార్, తహసీల్దార్లు కె.లక్ష్మి, ఎం.ఉదయభాస్కరరావు పాల్గొన్నారు.